క్లుప్తంగా

డీఈఈ రాంబాబుకు ఎక్సలెన్సీ అవార్డు



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డీఈఈ రాంబాబు

అమలాపురం టౌన్: పంచాయతీరాజ్ డివిజన్ డీఈఈ అన్యం రాంబాబుకు ఇంజినీరింగ్ పరంగా చేస్తున్న నైపుణ్యతతో కూడిన సేవలకు గాను హైదరాబాద్ అతిథి పత్రిక అందించిన ఎక్సలెన్సీ అవార్డు లభించింది. హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గెడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా డీఈఈ రాంబాబు అవార్డును అందుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 23 మంది అధికారులు, పలు సంస్థల ప్రతినిధులకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఈఈ రాంబాబును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ బీవీఎస్ మూర్తి, అమలాపురం ఈఈ కె.చంటిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు ఫోన్ చేసి అభినందించారు.

లోక్ అదాలత్ వాయిదా

అమలాపురం టౌన్: స్థానిక కోర్టుల సముదాయ ప్రాంగణంలో వచ్చే నెల 9వ తేదీన జరగాల్సిన నేషనల్ లోక్ అదాలత్‌ను అదే నెల 16వ తేదీకి వాయిదా వేసినట్లు కోర్టు కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ సూచించారు. 16వ తేదీ ఉయం 10.30 గంటలకు లోక్ అదాలత్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



తాళ్లరేవులో బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: స్థానిక చెరువుగట్టు సెంటర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఫ్యాన్సీ దుకాణాన్ని కోల్పోయిన బాధితుడికి ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆర్థిక సాయం చేశారు. దుకాణ యజమాని మట్టపర్తి తాతారావు కుటుంబీకులకు రూ.10 వేల నగదును మంగళవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరెడ్డి, కొల్లు శ్రీను, బొంతు శ్రీనివాస్, కుడుపూడి మల్లేష్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను కలిసిన తహసీల్దార్



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు పూల మొక్కని అందిస్తున్న తహసీల్దార్ సునీల్‌కుమార్

అల్లవరం: ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను మంగళవారం గోడిలోని ఆయన నివాసంలో అల్లవరం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.సునీల్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను శాలువాతో సత్కరించారు. మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రయత్నం చేయాలని, దానికి నా పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మెల్సీ అన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, వీఆర్‌ఓల సంఘ అధ్యక్షులు యు.చిట్టిబాబు, వీఆర్‌ఓ శ్రీనివాస్, రేవు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని హోమం నిర్వహిస్తున్న భక్తులు

అల్లవరం: మండలంలోని తాడికోనలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీహనుమాన్ సీత లక్ష్మణ సమేత శ్రీరామచంద్ర స్వామివారి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. వేద పండితులు సుదర్శన వెంకట జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో శిరంగు సత్యనారాయణ, లక్ష్మి దంపతులచే ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. బుధవారం ఉదయం 10.02 నిమిషాలకు స్వామివారి నూతన విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ, అనంతరం అన్నసమారాధన నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

నూతన ఆవిష్కరణలతోనే బంగారు భవిష్యత్తు

- యువతలో విజ్ఞాన తృష్ణను పెంపొందించాలి
- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం



రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన చంద్రయాన్-3 ప్రాజెక్టు



యానాంలో వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

యానాం: నాగలి నుంచి హరితవిప్లవం దాకా, చక్రం నుంచి విమానం దాకా, నిప్పు నుంచి అణుబాంబు దాకా, నాటకాల నుంచి త్రీడీ సినిమాల వరకూ, బ్లాక్ అండ్ వైట్ టీవీల నుంచి ఎల్ఈడీ టీవీల దాకా, ఉత్తరాల నుంచి సెల్‌ఫోన్, అంతర్జాలం వరకూ ప్రపంచం అత్యున్నత దిశగా అడుగులు వేసింది. నూతన ఆవిష్కరణలతో మానవుడి జీవన పయనం సుఖమయంగా మారింది. మనిషి చంద్రలోకాన్ని జయించి ఇలను ఇంద్రలోకంగా మార్చి ప్రపంచాన్ని అరచేతిలో బంధించాడు. సాంకేతిక, వైజ్ఞానిక రంగంలో ప్రగతి పథాన పురోగమిస్తూ మానవుడే మహనీయుడయ్యాడు. ఈ ఆధునిక మార్పులకు ప్రధాన కారణం సైన్స్‌లో నూతన ఆవిష్కరణలే.

సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్

భారతీయ వైజ్ఞానిక చరిత్రలో మరిచిపోలేని రోజు ఫిబ్రవరి 28. సరిగ్గా అదే రోజున 1928లో సీవీ రామన్ తన పరిశోధనా ఫలితాలను ప్రపంచానికి అందించారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్(ఎన్‌సీఎస్‌టీసీ) రామన్ ఎఫెక్ట్ కనిపెట్టిన రోజును నేషనల్ సైన్స్‌డేగా స్వీకరించడంతో ఫిబ్రవరి 28న సైన్స్ దినోత్సవం అయింది. రామన్ ఎఫెక్ట్ ద్వారా ఆకాశం నీలిరంగులో ఎందుకుంటుంది, ఆకాశంలో తారలు పగటి సమయంలో ఎందుకు కనిపించవు, సముద్రంలో నీరు నీలిరంగులో ఎందుకు కనిపిస్తుంది లాంటి ప్రశ్నలకు సూర్యకాంతి ద్వారా ఆయన చేసిన పరిశోధనల ద్వారా రామన్ జవాబు చెప్పారు. 1930లో ఆయన నోబెల్ బహుమతి అందుకున్నారు. జాతీయ సైన్స్‌డే 2024 థీమ్ 'సుస్థిర భవిష్యత్తుకోసం సైన్స్'.. ఈ థీమ్ ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో, అందరికీ స్థిరమైన భవిష్యత్తును సృష్టించడంలో సైన్స్ అండ్ టెక్నాలజీ కీలపాత్రను స్పష్టం చేస్తుంది.

నవోదయ విద్యాలయ విద్యార్థుల ప్రతిభ

యానాం నవోదయ విద్యార్థులు సైన్స్ రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. విద్యార్థి దుర్గేష్ తయారుచేసిన ప్రాజెక్టు అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించారు. శరీర సౌష్టవ కొలతలు అనే అంశంపై ఆయన ప్రాజెక్టు తయారుచేశారు. అదేవిధంగా సహజసిద్ధ వనరులను ఉపయోగిస్తూ మేడాశివాజీ తయారుచేసిన రీసెర్చ్ బేస్డ్ ప్రాజెక్టుకు బహుమతి లభించింది. పండ్లు, కూరగాయలు వ్యర్థాల నుంచి మధుమేహం లాంటి వ్యాధులకు ఉపశమనం కలిగించే మందులు తయారుచేసే విధానాన్ని విద్యార్థి కౌషిక్ తయారుచేశారని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయికి చంద్రయాన్ ప్రాజెక్టు

స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి తోట కార్తికేయ తయారుచేసిన చంద్రయాన్-3 నమూనాను పుదుచ్చేరి రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన-2023లో ప్రదర్శించి బెస్ట్ సబ్ థీమ్ విభాగంలో బహుమతి సాధించాడు. అనంతరం సదరన్ లెవెల్ సైన్స్ ఫేర్ దక్షిణ భారత రాష్ట్రాల వైజ్ఞానిక ప్రదర్శన-2024లో సైతం ఎంపికైనట్లు హెచ్ఎం టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు.

రహదారుల నిర్మాణానికి భూమి పూజ



ధనలక్ష్మీ కాలనీలో రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: స్థానిక కనకాలపేట గ్రామ పరిధిలోని ధనలక్ష్మీకాలనీలో ఎంపీ నిధులు రూ.19.87 లక్షలతో చేపట్టిన రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కొత్తగా ఏర్పడ్డ పలు కాలనీల్లో రహదారుల నిర్మాణం జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని కాలనీల్లో దశల వారీగా సిమెంట్ రోడ్లతో పాటు డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలన్న కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామకృష్ణ, సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగునాథం తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్‌కు అనూహ్య స్పందన



దుకాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక సర్క్యులర్ బజార్ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌కు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. డ్వాక్రా మహిళలు మెప్మా, వివిధ వాణిజ్య బ్యాంక్‌ల ద్వారా తీసుకున్న రుణాలతో ఇళ్ల వద్దే కుటీర పరిశ్రమలుగా పలు ఉత్పత్తులను తయారు చేసి అర్బన్ మార్కెట్‌లో దుకాణాలు ఏర్పాటు చేశారు. పలు తిను బండారాలు, అల్లికల వస్తువులు, క్లీనింగ్ పౌడర్లు, లిక్విడ్‌లు, పేపర్ ప్లేట్స్ తదితర ఉత్పత్తులను దుకాణాల్లో అమ్మకాలకు ఉంచారు. ఈ అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు ఏర్పాటుచేసిన వివిధ దుకాణాల గురించి చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్‌లకు మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి వివరించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ మహిళా సమాఖ్య రిసోర్స్ పర్సన్ పాము శ్యామల తదితరులు పాల్గొన్నారు.

లేబర్ లైసెన్స్‌లపై వ్యాపారులకు అవగాహన

అమలాపురం టౌన్: స్థానిక సహాయ కార్మిక కార్యాలయంలో పలు వ్యాపార సంఘాల ప్రతినిధులకు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ టి.నాగలక్ష్మి లేబర్ లైసెన్స్‌ల జారీపై మంగళవారం అవగాహన కల్పించారు. వ్యాపార సంస్థలు తమ లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోవడంతో పాటు కొత్త లైసెన్స్‌లను విధిగా పొందాలని ఆమె సూచించారు. వ్యాపార సంస్థలు, దుకాణాల్లో పనిచేసే వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ గురించి తెలియజేశారు. అవగాహన కార్యక్రమంలో ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు కొవ్వూరి వెంకటరెడ్డి, కంచిపల్లి అబ్బులు, మేడిచర్ల త్రిమూర్తులు, తటవర్తి నాగేశ్వరరావు, వలవల శివరావు, అనుపోజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహనకు మాక్ పోలింగ్



తాళ్లరేవు హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మాక్ పోలింగ్

తాళ్లరేవు: స్థానిక నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎస్‌వీఈఈపీ(సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమం నిర్వహించారు. సర్వ శిక్షాభియాన్ అధికారులు సుబ్రహ్మణ్యం, ఉమామహేశ్వరరావు, పద్మావతిల పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రం నిర్వహణ, ఓటు వేయించడం తదితర అంశాలను వివరిస్తూ విద్యార్థుల మాక్ పోలింగ్ జరిపారు. అనంతరం ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ తాళ్లరేవులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ అధికారులు మాట్లాడుతూ ఓటు చాలా విలువైనదని, యువత ఓటుపై అవగాహన పెంచుకుని ప్రతిఒక్కరూ విధిగా ఓటు వేయాలని సూచించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.ఆశాలత, స్టాఫ్ సెక్రటరీ వి.అప్పారావు, ఉపాధ్యాయులు గంగరాజు, అరుణకుమారి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు ముమ్మరం చేయండి

- ప్రకటనల బోర్డులకు పన్ను విధింపులో అధికారుల నిర్లక్ష్యం
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం



మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: పట్టణంలో ప్రైవేటు హోర్డింగ్‌లు, ప్రకటనల బోర్డులు అనేకం వెలుస్తున్నా వాటికి సక్రమంగా పన్నులు విధించడం లేదని, దీని వల్ల మున్సిపాలిటీ భారీగా ఆదాయాన్ని కోల్పోతుందని కౌన్సిల్ పాలక పక్ష కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో పాలక పక్ష కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర మాట్లాడుతూ ప్రకటనల పన్నుల విధింపు, వసూళ్లలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఖాళీగా ఉంటున్న ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగితో పాటు 15 వార్డుల సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలను క్షేత్ర స్థాయికి పంపి పన్నుల వసూళ్లను ముమ్మరం చేయాలని కమిషనర్ ఎస్.మనోహర్‌కు కౌన్సిలర్ నాగేంద్ర సూచించారు.

టీడీపీ కౌన్సిలర్ ఆరోపణలను తిప్పికొట్టిన బులినాని

ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ప్రభుత్వ పథకాల సభలకు కుర్చీలు, టెంట్‌లకు ఎక్కువ ఖర్చు చేశారని ఆరోపించారు. దీనిపై స్పందించిన పాలక పక్ష కౌన్సిలర్ సంసాని బులినాని మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలని చెప్పి మీరెన్ని బిల్లులు పెట్టారో మాకు తెలుసునని ధ్వజమెత్తారు. మంత్రి విశ్వరూప్ సూచనలతో అన్ని వార్డులకు సమాన ప్రాతిపదికన అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. మొన్నటి వరకూ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అయ్యప్పనాయుడు వెళుతూ దాదాపు రూ.3 కోట్ల పనులకు బిల్లులు మంజూరు చేశారని, వాటిపై విచారణ చేపట్టి బిల్లులను పరిశీలించాలని కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర కోరారు. సమావేశంలో కమిషనర్ మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నాని రాజు, మున్సిపల్ డీఈఈ నాగ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యమివ్వండి

- సమగ్ర శిక్షా ఏపీసీ మధుసూదనరావు



కొమరగిరి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్షా ఏపీసీ మధుసూదనరావు

ఐ.పోలవరం: పాఠశాలల్లో మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు సూచించారు. మండలంలోని కొమరగిరి, మురముళ్ల, మొండి, పశువుల్లంక గ్రామాల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో తాగునీటికి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు, టాయిలెట్లు, విద్యుదీకరణ, ఫ్యాన్లు, లైట్లు ఏ విధంగా పనిచేస్తున్నాయో పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాస్థాయిని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఏపీసీ మధుసూదనరావు మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి, పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూర్చిందన్నారు. మౌలిక వసతులు మరమ్మతులకు గురైతే వెంటనే వాటిని ఎస్ఎంఎఫ్ నిధులతో బాగు చేయించాలని హెచ్ఎంలకు సూచించారు. మధ్యాహ్న బోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనం తయారు చేసే ప్రాంతం, విద్యార్థులు భోజనం చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్నికల నిర్వహణపై ఉపాధ్యాయులకు శిక్షణ



మహిళా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు పల్లంరాజు, శర్మ

అమలాపురం టౌన్: వచ్చే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించే అమలాపురం పట్టణ, మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ తరగతులకు రిసోర్స్ పర్సన్లుగా సరిదే సత్య పల్లంరాజు, కొంపెల్ల వీవీఎస్ శర్మ వ్యవహరించగా అమలాపురం డిప్యూటీ తహసీల్దార్, మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షించారు. శిక్షణలో భాగంగా ఈవీఎం, వీవీపీఏటీలపై అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్ ఏ విధంగా నిర్వహించాలి, మాక్ పోలింగ్ అనంతరం ఏ విధంగా వీవీపీఏటీలోని స్లిప్‌లను భద్రపరచాలి వంటి విషయాలను తెలియజేశారు. పీవో, ఏపీఐ, ఓపీఓ విధులు, పీఓ డైరీ, ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు తదితర అంశాలను వివరించారు.

గృహనిర్మాణ లబ్ధిదారులకు రుణం మంజూరు

యానాం: నియోజకవర్గ పరిధిలో స్లమ్ క్లియరెన్స్ బోర్డు ఆర్థిక సాయంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు రుణాలు మంజూరైనట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మొత్తంగా 67 మంది లబ్ధిదారులకు మొదటి, రెండు, మూడు విడతల్లో కలిపి రూ.84.40 లక్షల రుణం మంజూరైందన్నారు. 52 మంది లబ్ధిదారులకు కలిపి మొదటి విడతగా రూ.62.40 లక్షలు, తొమ్మిది మందికి రెండో విడతగా రూ.14.40 లక్షలు, ఆరుగురికి మూడో విడత రూపేణా రూ.7.60 లక్షలు రుణం వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యిందన్నారు.

నేడు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రజావేదిక

తాళ్లరేవు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలతో పాటు గ్రామ సభలు కూడా నిర్వహించామన్నారు. ఆయా తనిఖీల ఫలితాలను చర్చించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



విలసవిల్లిలో వలంటీర్లను సత్కరించిన సర్పంచ్ ఊర్మిళాదేవి



దేవగుప్తంలో వలంటీర్లను సత్కరించిన సర్పంచ్ వెంకటరావు

ఉప్పలగుప్తం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవారత్నగా ఎంపికైన ఆకుల కనకమహాలక్ష్మి, సేవామిత్రలుగా ఎంపికైన 18 మంది వలంటీర్లను సత్కరించి ప్రభుత్వం సమకూర్చిన పురస్కారాన్ని, నగదును అందించారు. వీరితో పాటు గ్రామంలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన వెల్ఫేర్ అసిస్టెంట్ డి.లావణ్యను, డిప్యుటేషన్‌పై వెళ్లిన ఏఎన్ఎం అపర్ణను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి, కార్యదర్శి దాసరి కృష్ణాజీ, బీర నరసింహమూర్తి, కోలా ఏసు, పుత్సాల ఏసు, బళ్ల నాగసతీష్, దాసరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం

అల్లవరం: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా దేవగుప్తం పంచాయతీ పరిధిలోని వలంటీర్లకు సర్పంచ్ సాధనాల వెంకటరావు మంగళవారం సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లను శాలువాలతో సత్కరించి, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, సాధనాల శ్రీను, కార్యదర్శి పి.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి



యానాంలో జరిగిన బాలల దినోత్సవంలో చిన్నారుల నృత్యం

యానాం: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాలల్లో సహజసిద్ధంగా ఉండే నైపుణ్యాలను వెలికి తీసి వారి అభ్యున్నతికి పాటు పడాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాతాకు పరిహారం సొమ్ము

యానాం: ఓఎన్‌జీసీ సంస్థ అందించిన వేట నష్టపరిహారం సొమ్ము ప్రభుత్వ ఖాతాలో మంగళవారం జమయ్యింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి లబ్ధిదారుల జాబితాపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామిలు సమీక్షించారు. మొత్తం 5,462 మందికి గాను 173 మందిని మినహాయించి 5,289 మందితో కూడిన తుది జాబితాను యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో పుదుచ్చేరి మత్స్యశాఖ ఉన్నతాధికారులకు పంపించనున్నారు. ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం ఇవ్వడంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో త్వరలో సొమ్ము జమవుతుందన్నారు.

ఆకట్టుకున్న జంతు ప్రదర్శన



జంతు ప్రదర్శనలో పెంపుడు కుక్క విన్యాసం

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ యానిమల్ హజ్బెండరీ అండ్ యానిమల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పశువుల ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన పశువులు, కోళ్లు, పెంపుడు కుక్కల ప్రదర్శన పోటీ అందరినీ ఆకట్టుకుంది. మెట్టకూరు, ఫ్రాన్స్‌తిప్ప, కురసాంపేట తదితర ప్రాంతాల నుంచి రైతులు, పలువురు ఔత్సాహికులు తమ కపిలజాతి ఆవులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, కుక్కలు, కోళ్లు తదితర పెంపుడు జంతువులను ప్రదర్శనకు తీసుకొచ్చారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామిల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జి.లతామంగేష్కర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కె.ఆంధ్రా జాబాకుమార్, డాక్టర్ వెంకటరమణ, పువ్వల సత్యనారాయణమ్మ, చెక్కపల్లి శ్రీరామ్ పాల్గొన్నారు.